క్లుప్తంగా

కొనసాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియ

పెద్దశంకరంపేట(మెదక్): సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతోంది. సోమవారం ఆన్‌లైన్ ప్రక్రియను ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో 11,314 నివాస గృహాలున్నాయని, ఇప్పటి వరకు 50 శాతం ఆన్‌లైన్‌లో నమోదు పూర్తయిందన్నారు. ఎన్యుమరేటర్లు, ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదును వేగవంతం చేయాలని సూచించారు.

పైపులైన్ పరిశీలన


పైపులైన్‌ను పరిశీలిస్తున్న ఏఈ నందకిషోర్

రేగోడ్(మెదక్): ప్రతీ ఒక్కరికీ తాగునీటి సరఫరా చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈ నందకిషోర్ తెలిపారు. మండల కేంద్రం రేగోడ్‌లోని బీసీ కాలనీలో నెలకొన్న నీటి సమస్యపై కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి సమస్య ఎక్కడ ఉన్నా పరిష్కరిస్తామని చెప్పారు. తాగునీటి సరఫరా సమయంలో మోటార్లు పెడితే నల్లా కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ నాగేందర్‌రావు కులకర్ణి, రామాగౌడ్, మాజీ ఎంపీటీసీ నర్సింహులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాక్సినేషన్

చిన్నశంకరంపేట(మెదక్): పశువులకు నల్లమబ్బు నివారణకు గ్రామాల్లో నిర్వహిస్తున్న వాక్సినేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ గీతా మాలిక కోరారు. పది రోజుల పాటు గ్రామాల్లో నిర్వహించే వాక్సినేషన్ కార్యక్రమంలో రైతులు సహకరించి, పశువులకు టీకాలు వేయించాలని తెలిపారు. గ్రామాల్లో ఉదయం పశువులకు వాక్సినేషన్ అందిస్తున్నట్లు తెలిపారు. పశువులు, గొర్రెలు సీతాకాలంలో నల్లమబ్బుకు గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. రోగనిరోధక చర్యలు చేపట్టేందుకు ముందస్తుగా వాక్సినేషన్ అందిస్తామన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బహుమతులు అందజేత


బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్, ఎంఈఓ

వెల్దుర్తి(తూప్రాన్): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఉన్నత పాఠశాలల పరిధిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి సోమవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ కృష్ణ, ఎంఈఓ యాదగిరి మాట్లాడుతూ.. పోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. ఓడినవారు దానిని స్ఫూర్తిగా తీసుకొని గెలుపొందడానికి కృషి చేయాలన్నారు.

కాంగ్రెస్ పాలనపై బీజేపీ మాట్లాడడం విడ్డూరం


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ ప్రజాపాలనపై బీజేపీ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా నాయకుడు రాజిరెడ్డి విమర్శించారు. నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఏకకాలంలో రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని, నిరుద్యోగులకు లక్షలాది ఉద్యోగాలు ఇచ్చిందని, ప్రజాపాలన ద్వారా మహిళలకు ఉచిత బస్సుసౌకర్యం, ఉచిత విద్యుత్ అందిస్తున్న విషయం బీజేపీ నాయకులు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మనోజ్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ కార్యదర్శి రామ్‌చందర్, రాజ్‌కుమార్‌గౌడ్, రమేశ్‌గౌడ్, రాజాసింగ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన మయూక

దుబ్బాకరూరల్: మండలంలోని చీకోడ్ గ్రామానికి చెందిన పెద్దమాతరి బాబు, లత దంపతుల కుమార్తె మయూక ఇటీవల ఎంబీబీఎస్ సీటు సాధించింది. దళిత కులానికి చెందిన ఆ విద్యార్థినిని దళిత సంఘాల నాయకులు, గ్రామస్తులు సోమవారం అభినందించారు.

అంతర్ జిల్లా రహదారి అధ్వానం

- ఇబ్బందుల పాలవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

రామాయంపేట(మెదక్): మెదక్–కామారెడ్డి జిల్లాల సరిహద్దు గ్రామాలను కలిపే రహదారి పూర్తిగా శిథిలమైంది. దీంతో రెండు జిల్లాలకు చెందిన శివారు గ్రామాల ప్రజలు ఇబ్బందులపాలవుతున్నారు. మండలంలోని కాట్రియాల నుంచి కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం రామేశ్‌పల్లి మధ్య ఏడు కిలోమీటర్ల దూరం ఉంటుంది. కాగా ఈ దారిలో కాట్రియాల పరిధిలో పెద్ద చెరువు అలుగుతో పాటు ఎర్ర కుంట కాల్వ ఉంది. కొద్దిపాటి వర్షం కురిసినా కాల్వ పొంగి పొర్లుతుండటంతో ఈదారిలో ఏటా ప్రయాణాలు నిలిచిపోతాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వారం రోజుల పాటు ఈదారిలో ప్రయాణాలు స్తంభించాయి. కాగా చిన్నపాటి చినుకులు కురిసినా.. రహదారి మొత్తం బురదమయంగా మారుతోంది. గ్రామానికి చెందిన రైతుల వ్యవసాయ భూములు ఈదారిలోనే ఉండగా, వారు పొలాలకు రావడానికి, తమ పంట ఉత్పత్తులను తరలించుకోవడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డును పూర్తిస్థాయిలో తారు రోడ్డుగా మారిస్తే రెండు జిల్లాల శివారులోని గ్రామాల ప్రజల ఇబ్బందులు తీరుతాయని గ్రామస్తులు పేర్కొన్నారు. ముఖ్యంగా చెరువు, కుంట వద్ద రోడ్డుపై కల్వర్టుల నిర్మాణం అత్యవసరం


పాక్షికంగా దెబ్బతిన్న రహదారి


కల్వర్టు నిర్మించాల్సింది ఇక్కడే

కాగా, ఈ విషయమై ఎన్నోసార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడంలేదని వారు వాపోతున్నారు.

తారురోడ్డుగా మార్చాలి



కాట్రియాల, రామేశ్‌పల్లి గ్రామాల మధ్య రోడ్డు పాక్షికంగా శిథిలమై ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఇబ్బందులపాలవుతున్నారు. ఏటా వర్షకాలంలో ఈదారిలో ప్రయాణాలు స్తంభిస్తాయి. ఈ విషయమై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తున్నా.. ఎంత మాత్రం ఫలితం లేదు. వెంటనే ఈ రోడ్డును తారురోడ్డుగా మార్చాలి.

– కొప్పుల రాజయ్య, కాట్రియాల

సీఎంను సన్మానించిన గ్రంథాలయ సంస్థ చైర్మన్

మెదక్‌జోన్: సిద్దిపేట జిల్లాలో జరిగే పరిశ్రమ ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి మనోహరాబాద్ మండలం కాళ్లకల్ సమీపంలో ల్యాండ్ అయ్యారు. దీంతో జిల్లా గ్రంథాలయ సంస్థచైర్మన్ సుహాసిని రెడ్డి, సీఎంను కండువాతో సన్మానించారు. సీఎం వెంట మంత్రులు పొన్నం ప్రభాకర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు ఎలక్షన్‌రెడ్డి, నర్సారెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎంకు స్వాగతం పలికిన నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): కోకాకోల పరిశ్రమ ప్రారంభోత్సవానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిని కలెక్టర్ రాహుల్‌రాజ్, వివిధ శాఖల అధికారులతో పాటు స్థానిక నాయకులు సోమవారం ఘనస్వాగతం పలికారు. సిద్దిపేట్ జిల్లా ములుగు మండలంలోని బండతిమ్మాపూర్ శివారులో నిర్మించిన కోకాకోలా పరిశ్రమను ప్రారంభించడానికి వచ్చిన సీఎం


సీఎంను సన్మానిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి

ను మాజీ ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ వర్కింగ్ ప్రసిడెంట్ మహిపాల్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

రోడ్డుపై ఉన్న దుకాణాల తొలగింపు

నర్సాపూర్: పట్టణంలోని జాతీయ రహదారిని ఆనుకొని ఏర్పాటు చేసిన దుకాణాలను మున్సిపల్ అధికారులు సోమవారం తొలగించారు. మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ప్రభాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీ తన సిబ్బందితో వెళ్లి రోడ్డును ఆనుకొని ఏర్పాటు చేసిన దుకాణాలు, ఆక్రమించిన దుకాణాలను తొలగించారు. అందులో భాగంగా పలు దుకాణాలకు చెందిన సామగ్రిని మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. కాగా ఇటీవల జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు తొలగించాలని కౌన్సిలర్లు తీర్మానం చేసిన దరిమిలా అధికారులు ఆక్రమణలను తొలగించారు.


దుకాణాల నుంచి సామగ్రిని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నాగ్సాన్‌పల్లి బీజేపీ బూత్ కమిటీ ఏర్పాటు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని నాగ్సాన్‌పల్లి గ్రామ బీజేపీ బూత్ కమిటీని ఎన్నుకున్నట్లు మండలాధ్యక్షుడు రాకేశ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్ అధ్యక్షుడిగా శేఖర్ కార్యదర్శిగా గణేశ్, వాట్సాప్ ప్రముఖ్‌గా ప్రవీణ్, లాభర్థి ప్రముఖ్‌గా ప్రసాద్, మన్‌కిబాత్ ప్రముఖ్‌గా మనోహర్‌తో పాటు భిక్షపతి, భగవంత్, శంకర్, ప్రవీణ్, లావణ్య, లక్ష్మీనారాయణ తదితరులను ఎన్నుకున్నట్లు చెప్పారు.


బూత్ అధ్యక్షుడికి నియామకపత్రం అందిస్తున్న రాకేష్

కార్మికులకు స్వెట్టర్ల పంపిణీ


టేక్మాల్‌లో స్వెట్టర్లను అందిస్తున్న కిరణ్, నాయకులు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్ మేజర్ పంచాయతీ కార్మికులకు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వీరప్ప కుమారుడు భక్తుల కిరణ్ సోమవారం స్వేటర్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చలికాలాన్ని దృష్టిలో పెట్టుకొని 19 మంది కార్మికులకు స్వెట్టర్లను అందించినట్లు తెలిపారు. పారిశుద్ధ్యాన్ని కాపాడే పంచాయతీ కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని స్వెట్టర్లను అందిండంతో పాటూ పలు రకాల సామాజిక కార్యక్రమాలు చేపడుతున్న కిరణ్‌ను గ్రామస్తులు అభినందించారు. ఇందులో నాయకులు రవి, నాయికోటి భాస్కర్, కమ్మరి సిద్ధన్న, సుధాకర్, సలావుద్దీన్, మంగలి మాణిక్యం, అనిల్, శివ, బాలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తీరుతో గురుకుల వ్యవస్థ నిర్వీర్యం

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గురుకుల విద్యా వ్యవస్థ నిర్వీర్యమై పోయిందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం టీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులతో కలిసి గజ్వేల్‌లోని మైనార్టీ, కేజీబీవీ, ఎంజేపీ గురుకులాలను సందర్శించారు. వసతుల తీరును పరిశీలించి విద్యార్థుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులాల్లో ఉడికీ ఉడకని అన్నం పెడుతున్నారని వాపోయారు. స్నానానికి నీళ్ల సరిపోవడం లేదని, బెడ్‌షీట్లు ఇవ్వలేదని, షూస్, యూనిఫామ్స్, కాస్మెటిక్ చార్జీలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇప్పటి వరకు రాష్ట్రంలోని గురుకులాల్లో 600మంది ఫుడ్ పాయిజన్ బారిన పడ్డారని వాపోయారు. ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకపోతే సహించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, టీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరశురాములు, నాయకులు పర్వతాలు, కమలాకర్, కుమార్, నవాజ్‌మీరా, రమేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఆహారపదార్థాను పరిశీలిస్తున్న ప్రతాప్‌రెడ్డి

చిట్కుల్‌లో సామాజిక తనిఖీ


చిట్కుల్ సభలో మాట్లాడుతున్న డీఆర్‌పీ నరేశ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో సామాజిక తనిఖీ నిర్వహించి, సోమవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌పీ నరేశ్ మాట్లాడుతూ.. గ్రామంలో నిర్వహించిన ఉపాధి పనుల విషయమై నెల రోజులుగా సామాజిక తనిఖీ చేశామన్నారు. గ్రామంలో జరిగిన ఉపాధి పనుల ఖర్చులకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. కూలీల జాబ్‌కార్డులు, మస్టర్ల నిర్వహణ, వేతనాల చెల్లింపుల గురించి గ్రామస్తులకు వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి, వీఆర్‌పీలు భీమేశ్, రాకేష్, రజనీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత


ఎల్‌ఓసీని అందజేస్తున్న నర్సారెడ్డి

తూప్రాన్: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తూంకుంట నర్సారెడ్డి సోమవారం రూ.4.5 లక్షల ఎల్‌ఓసీ అందజేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ అన్నారు. మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులో నివాసం ఉంటున్న ప్రశాంత్ రెండు కిడ్నీలు పని చేయక ఆస్పత్రిలో వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయం గుర్తించిన మున్సిపల్ చైర్‌పర్సన్ స్పందించి వైద్యం కోసం సీఎం సహాయ నిధి నుంచి రూ.4.5లక్షల ఎల్‌ఓసీని నర్సారెడ్డి చేతులమీదుగా అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శేరిపల్లి మాజీ ఎంపీటీసీ మృతి



చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామ మాజీ ఎంపీటీసీ రామస్వామిగౌడ్(70) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఉమ్మడి మండలంలో శేరిపల్లి, మిర్జాపల్లి గ్రామాల ఎంపీటీసీగా ఆయన పనిచేశాడు. మాజీ ఎంపీటీసీ మృతికి మాజీ ఎంపీపీ రాధ, అరుణ, మాజీ సర్పంచ్ రమేశ్, నార్సింగి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్దన్ సంతాపం వ్యక్తం చేశారు.

అడవులకు నిప్పుతో ముప్పు

ఫారెస్ట్ అధికారులు

చేగుంట(తూప్రాన్): అడవులకు నిప్పు పట్టడంతో కలిగే నష్టాలను ఫారెస్ట్ అధికారులు పోతాన్‌పల్లి గ్రామంలో సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తూప్రాన్ డివిజన్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అంబర్‌సింగ్ ప్రజలకు విద్యార్థులకు అడవుల ప్రాముఖ్యతను వివరించారు. అడవులకు నిప్పు పెట్టడంతో భూమి బొరియల్లో ఉండే పాములు, బల్లులు, ఎలుకలు, తేళ్ల వంటి జీవరాసులు మృతి చెంది, వాటి మనుగడకు ముప్పు ఏర్పడుతుందన్నారు. అడవికి నిప్పు పెట్టే వారిపై కేసులు కూడా పెట్టడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ ఆఫీసర్లు ఓంప్రకాశ్, చిరంజీవి, మౌనిక, రవికుమార్, చంద్రశేఖర్, సిబ్బందితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఫారెస్ట్ అధికారులు

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

కొల్చారం(నర్సాపూర్): విద్యార్థులపై చేయి చేసుకుంటూ ఇష్టారీతిగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగిన సంఘటన మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం చోటుచేసుకుంది. పాఠశాల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సంపత్ కొంతకాలంగా సైకోగా మారి, విద్యార్థుల ఉపాధ్యాయులను పలు రకాలుగా వేధిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా సోమవారం గ్రామానికి చెందిన మేదరి నర్సింలు కుమారుడు అక్షిత్ కుమార్‌ను రెండు చెవులు పట్టి పైకి లేపి, కింద పడేసినట్లు, దీంతో విద్యార్థి తరగతి గదిలోని మూత్రం చేసుకోవడమే కాకుండా స్పృహ తప్పి పడిపోయాడు. ఈ విషయమై తోటి ఉపాధ్యాయులు వారిస్తే వారిని సైతం బండబూతులు తిట్టినట్లు అక్కడ ఉపాధ్యాయులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న అక్షిత్ తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకొని ఆందోళనకు దిగారు. వీరికి ఉపాధ్యాయులు సైతం మద్దతు తెలిపారు. దీంతో ఉపాధ్యాయుడు సంపత్ పాఠశాల నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న మండల విద్యాధికారి సత్యనారాయణ రావు పాఠశాలకు చేరుకొని ఆందోళనకు దిగిన విద్యార్థి తల్లిదండ్రులకు నచ్చజెప్పి సదరు ఉపాధ్యాయుడిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.


తండ్రితో విద్యార్థి అక్షిత్

జిల్లాస్థాయిలో విద్యార్థినుల ప్రతిభ


ప్రశంసాపత్రాలతో మంభోజిపల్లి గీతా విద్యార్థులు

హవేళిఘణాపూర్(మెదక్): ఇటీవల జిల్లా కేంద్రం మెదక్‌లో నిర్వహించిన జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో మెదక్ మండలం మంభోజిపల్లి గీతా ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభకనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి రామాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గీతా విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో చదువులకే పరిమితం కాకుండా ప్రదర్శనలో కూడా ఆసక్తి చూపి రాణించడంపై ఆయన అభినందించారు. ప్రకృతి మనుగడ, అభివృద్ధికి తోడ్పడే శాస్త్ర విజ్ఞానం నేర్చుకుంటే విద్యకు మరింత వన్నె తెచ్చిన వారమవుతారని అన్నారు. సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభకనబర్చిన విద్యార్థులు సంజన, అంజన, అనూష, యమున, తహసీమ్, హారిణి, నిఖిత, గంగోత్రి, వాగ్దేవిలను అధ్యాపకబృందం, సుగుణాకర్, అనిత, చైతన్య, లేపాల్ అభినందించారు.

ప్రసాద్ సేవలు మరువలేనివి

డైట్ ప్రిన్సిపాల్ రమేశ్

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థుల అభివృద్ధికి ఎంతో కృషి చేసిన హెచ్‌ఎం ప్రసాద్ సేవలు మరువలేనివని మెదక్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. సోమవారం మండలంలోని వెంకట్రావ్‌పేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పదవీ విరమణ సన్మానసభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. 32 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో ఉండి విద్యార్థుల అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన అతని సేవలు మరువలేనివని చెప్పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, బంధువులు, స్నేహితులు అతన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ఎంఈఓలు బుచ్చానాయక్, బాలరాజు, విఠల్, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు ప్రవీణ్‌కుమార్, జ్ఞాన ప్రకాష్, ఎశెందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


హెచ్‌ఎం ప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న డైట్ ప్రిన్సిపాల్ రమేశ్

ఉపాధ్యాయులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సంతోష్‌కుమార్

కౌడిపల్లి(నర్సాపూర్): ఉపాధ్యాయులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని నిమ్స్ ఆస్పత్రి ఫిజియోథెరపి డాక్టర్ సంతోష్ కుమార్ తెలిపారు. సోమవారం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో మండలంలోని వివిధ పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ఫిజియోథెరపిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిజియోథెరపితో శరీరంలోని వివిధ భాగాల్లో ఉన్న నొప్పులు, ఇతర సమస్యలను బాగు చేయవచ్చన్నారు. అనారోగ్యానికి గురైతే ఆందోళన చెందకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు రకాల వ్యాయామాలను చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలరాజు, మండల విద్యాశాఖ ఫిజియోథెరపి డాక్టర్ స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో క్రీడాపోటీలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాయిలాపూర్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పాఠశాలలో విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలను నిర్వహించి, ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం లవీనజ్యోతి, పీఈటీ కృష్ణాగౌడ్ తెలిపారు.


రాయిలాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

సంక్షిప్త వార్తలు

◆ 6న జిల్లా గౌడ జనహక్కుల పోరాటసమితి సమావేశం

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలో ఈనెల 6న గౌడసంఘం రేణుకాఎల్లమ్మ ఆలయం వద్ద గౌడ జనహక్కుల పోరాటసమితి మెదక్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహిస్తారని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రం దుర్గాగౌడ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. సమావేశంలో గౌడ కులస్తుల సమస్యల పరిష్కారం కోసం చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. సంఘం సభ్యులతో పాటు గౌడ సంఘం పెద్దలు పాల్గొనాలని కోరారు.

◆ శ్రీశైలానికి శివస్వాముల పాదయాత్ర

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లో శివమాల ధరించిన శివ భక్తులు సోమవారం ఉదయం గోకర్ణేశ్వర శివాలయంలో శివుడికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఇరుముడితో మాల విరమణ కోసం శ్రీశైలానికి పాదయాత్రగా తరలి వెళ్లారు. యూత్ కాంగ్రెస్ నాయకుడు రామాగౌడ్ శివస్వాములకు భిక్ష కోసం గురుస్వామి శివకుమార్‌కు రూ.5వేలను అందజేశాడు. కార్యక్రమంలో శివగురుస్వామి శంకర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యాంరావు కులకర్ణి, కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడు శంకరప్ప, రాములు, ప్రభాకర్, అంజిరెడ్డి, బర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ కళాశాలలో 4న తల్లిదండ్రుల సమావేశం

వెల్దుర్తి(తూప్రాన్): రాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఉదయం 11 గంటలలోపు తప్పనిసరిగా హాజరై విద్యార్థుల అభివృద్ధికి సలహాలు, సూచనలు అందజేయాలన్నారు.

◆ పశు పోషణలో జాగ్రత్తలు

మిరుదొడ్డి(దుబ్బాక): పశుపోషణలో తగు జాగ్రత్తలు పాటించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ మౌనిక రైతులకు సూచించారు. మండల పరిధిలోని ధర్మారంలో పశు గణనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పశు గర్భస్థ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు సకాలంలో టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అబ్దుల్ సత్తార్, గోపాల మిత్రలు లక్ష్మణ్, పరశురాములు, రైతులు చంద్రయ్య, బాల్‌రెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

◆ పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్



దుబ్బాకటౌన్: పేదలకు సీఎం సహాయనిధి వరంగా మారిందని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవరెడ్డి అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాయపోల్ మండల పరిధిలోని టెంకంపేటకు చెందిన తిరుపతి కోటేశ్‌కు రూ.38 వేలు, పెద్దోళ్ల రమేష్‌కు రూ.19,500ల చెక్కులు అందజేశామన్నారు. టెంకంపేట మాజీ సర్పంచ్ తిరుపతి నర్సింహులు, బీఆర్‌ఎస్ నేత బాల్‌రెడ్డి తో పాటు తదితరులు పాల్గొన్నారు.